సాక్షి
వికారాబాద్
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



కారుమబ్బులు..
మూడు రోజులుగా పలుచోట్ల అకాల వర్షాలు కురిశాయి. సాయంత్రం కాగానే ఆకాశం మేఘావృతమవుతోంది. 8లో▸



గర్భస్థ శిశువు మృతి
వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భస్థ శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. 8లో▸



షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
వేసవితాపానికి ఉపశమనం కోసం ఇంట్లో పెట్టుకున్న కూలర్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపో వడంతో మంటలు చెలరేగాయి. 8లో▸

సన్న బువ్వ.. విజయీభవ

సన్న బియ్యం పంపిణీపై హర్షం
- రేషన్ షాపులకు క్యూ కడుతున్న జనం
- జిల్లాలో మొత్తం దుకాణాలు 588
- కార్డులు 2,48,122, లబ్ధిదారులు 8,52,122 మంది
- ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యం 5,582 మెట్రిక్ టన్నులు



ధారూరు రేషన్ షాపులో సన్నబియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

వికారాబాద్: వరి అన్నాన్ని జేజ బువ్వ అని ముద్దుగా పిలుచుకోవడం మనందరికీ తెలుసు.. అందులోనూ సన్నబియ్యం అన్నం తినడం అంటే పేదలకు గొప్ప విషయమేనని చెప్పాలి. అలాంటి కలను ప్రభుత్వం నెరవేర్చడంతో రేషన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం పంపిణీ చేసినంత కాలం తీసుకునేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎప్పుడైతే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారో దుకాణాలకు క్యూ కడుతున్నారు. ఈ పథకంపై ఎవ్వరిని కదిపినా సన్నబియ్యం పంపిణీ చాలా మంచి కార్యక్రమం అని కితాబు ఇస్తున్నారు. దొడ్డు బియ్యాన్ని కేవలం దోసె పిండికి మాత్రమే వినియోగించేవారు.. చాలా మంది కిరాణా దుకాణాల్లో విక్రయించేవారు. ప్రస్తుతం సన్నబియ్యం ఇస్తుండటంతో ప్రతి ఒక్కరూ రేషన్ షాపునకు వస్తున్నారు. జిల్లాలో 588 రేషన్ దుకాణాలు.. 2,48,122 కార్డులు.. 8,52,122 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 5,582 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

ప్రజల నమ్మకం వమ్ము కాకుండా చూడాలి

మిల్లర్ల మాయాజాలం.. రేషన్ డీలర్ల కుమ్మక్కు మంత్రం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో గతంలో రేషన్ బియ్యం పంపిణీ పథకం అభాసుపాలైన విషయం అందరికీ తెలిసిందే.. ఇప్పటి వరకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యంలో 50 శాతానికి పైగా తినకుండా బయట విక్రయించారు. మిల్లర్లు దొడ్డు బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రీసైక్లింగ్ తర్వాత మళ్లీ లెవీ రూపంలో ప్రభుత్వానికి అందజేసేవారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లులకు తరలించగా వాటిని మిల్లర్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల బాట పడుతున్నారు.

సంతోషంగా ఉంది



రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. బియ్యం బాగున్నాయి. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలి. ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– మంగమ్మ, యాలాల

మంచి నిర్ణయం



ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించడం ఎంతో మంచి నిర్ణయం. రేషన్ షాపువద్ద ఇంత మందిని ఎప్పుడూ చూడ లేదు. సన్నబియ్యం కావడంతో ప్రతి ఒక్కరూ తింటారు.
– మేకల అమృతమ్మ, ధారూరు

బియ్యం బాగున్నాయి



సన్నబియ్యం చాలా బాగున్నాయి. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం తినలేక పోయే వాళ్లం. సన్న బియ్యం కావడంతో ప్రతి ఒక్కరూ తీసుకెళ్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.
– సాబేర బేగం, బొంపల్లి

కదలని 'ఇందిరమ్మ'

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒక్క అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కు అన్నట్లు తయారైంది. పైలెట్ గ్రామాల్లో పథకం ప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు ఉండగా ఒక్కోదానికి 3,500 చొప్పున 14,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. మొదటి విడతలో 2,285 ఇళ్లకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. 266 ఇళ్లకు హౌసింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వగా కేవలం 23 ఇళ్లకు సంబంధించిన పునాది పనులు మాత్రమే పూర్తయ్యాయి.మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదిలా ఉండగా రెండో విడత లబ్ధిదారులను ఎంపికకు అధికారులు సిద్ధమయ్యారు. పథకం సమర్థవంతంగా అమలు కాకపోవడానికి ఇంజనీర్ల కొరత కూడా ఓ కారణంగా తెలుస్తోంది. పథకం పర్యవేక్షణకు ఒక పీడీ, నలుగురు డీఈలు, ముగ్గురు ఏఈలు మాత్రమే ఉన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.
– వికారాబాద్

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



కుల్కచర్ల: మక్తవెంకటాపూర్‌లో ప్రారంభ దశలోనే ఇందిరమ్మ ఇల్లు

– పూర్తి వివరాలు 9లో▸

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

అనంతగిరి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. బుధవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి కళాశాలలో విద్యార్థినీలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకోరాదని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ పి.రాము, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

తాండూరు టౌన్: మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11న పట్టణంలోని సింధు బాలికల జూనియర్ కళాశాలలో బీసీ సంఘం, గ్లోబల్ యువతరం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు కొనసాగనున్న ఈ మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు తగు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వికారాబాద్‌లో తనిఖీలు



వికారాబాద్ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్‌లో బుధవారం జిల్లా బీడీ టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల గుర్తింపు.. నేర చర్యలకు అడ్డుకట్టవేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణను అడ్డుకోవడం కూడా ఈ తనిఖీలో ప్రధాన భాగమన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఘన సన్మానం



బస్వరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బస్వరాజ్ పటేల్‌ను బుధవారం జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నాగయ్య, జిల్లా అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, బస్వరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్,నాయకులు లూయిస్,గౌస్ పటేల్, ధనశెట్టి, సుధీర్, తిర్మలయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రామలింగేశ్వర జాతర

బంట్వారం: కోట్‌పల్లి మండలం బుగ్గాపురం రామలింగేశ్వర జాతర నేటి నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త మహేందర్ రావు దేశ్‌ముఖ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పల్లకీ సేవ, ధ్వజారోహణం, 11న పల్లకీ సేవ, 12న అభిషేకం, రథోత్సవం, అన్నదానం, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, దీపార్చన, 14న పల్లకీ సేవ, ముగింపు వేడుకలు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



చీమల్‌దరిలో మహిళతో ముచ్చటిస్తున్న నీరజ్ మిట్టల్ తదితరులు

స్మార్ట్ పంచాయతీ చీమల్‌దరి

- కేంద్ర టెలి కమ్యూనికేషన్ కార్యదర్శి నీరజ్ మిట్టల్

మోమిన్‌పేట: పట్టణాల్లో ఉన్న టెలి కమ్యూనికేషన్ పరిజ్ఞానాన్ని పల్లెలో కూడా అందుబాటులోకి తీసుకురావాల్సి అవసరం ఉందని కేంద్ర టెలికమ్యూనికేషన్ కార్యదర్శి నీరజ్ మిట్టల్ అన్నారు. చీమల్‌దరి గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని ప్రతీ గ్రామంలో టెలి కమ్యూనికేషన్ వ్యవస్థను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్షాన లభై వేల కోట్ల రూపాయలతో ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. చీమల్‌దరిలో వైఫై అందుబాటులో ఉందని, పట్టణాల్లో ఉన్న టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ మొత్తం ఈ గ్రామంలో ఉందని తెలిపారు. ఆధార్ కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారని, ఇలాంటి మరెన్నో స్మార్ట్ జీపీలను తయారు చేయాలని ఆయన సూచించారు. చీమల్‌దరి గ్రామం అన్ని రకాలు అభివృద్ధి చెందిందని తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న డిజిటల్ బోధనలను పరిశీలించారు. ఆయన వెంట ప్రత్యేక డీజీటీ ప్రశాంత్ ఆర్.పాటిల్, తెలంగాణ టెలి కమ్యూనికేషన్ సీజీఎం జి.రత్నకుమార్, పీజీఎం చంద్రశేఖర్, ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఆర్‌ఐ గోవర్ధన్, కార్యదర్శి భరత్‌కుమార్ ఉన్నారు.

రైతులకు భూ పరిహారం చెక్కులు

తాండూరు: దుద్యాల్ మండలంలో పారిశ్రామిక వాడ కోసం భూములు ఇచ్చిన రైతులకు బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిహారం చెక్కులు అందజేశారు. తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో హకీంపేట్, లగచర్ల గ్రామాలకు చెందిన 30మంది రైతులకు చెక్కులు అందజేశారు. 29.22 ఎకరాలకు రూ.5.91 కోట్ల పరిహారం అందజేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, తహసీల్దార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



రైతుకు పరిహారం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

లింగ నిర్ధారణ చేస్తే క్రిమినల్ కేసులు



వికారాబాద్‌లోని ఈశా ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ

అనంతగిరి: అనుమతులు లేకుండా ఆస్పత్రులు, డయోగ్నస్టిక్ సెంటర్లు, లాబోరేటరీలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఈశా హాస్పిటల్, అనంత్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ యంత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి యాజమాన్యం, గైనకాలజిస్టులతో మాట్లాడారు. స్కానింగ్ అనేది బిడ్డ, తల్లి ఆరోగ్య పరిరక్షణ కోసం మాత్రమే చేయాలన్నారు. లింగ నిర్ధారణ కోసం చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేసి పీఎన్‌డీటీ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహిస్తున్న మెడికేర్ డయోగ్నస్టిక్ సెంటర్‌కు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో 15మంది స్టాఫ్ నర్సులకు నియామకపత్రాలు అందించడం జరిగిందన్నారు. ఈ నియామకాలు అన్ని కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానం ప్రకారం కమిటీ ఆమోదం పొందిన అనంతరం పారదర్శకంగా చేపట్టడం జరిగిందన్నారు.

అడవుల రక్షణ మన బాధ్యత

చెట్లను నరికితే మనకే నష్టం
- డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్
- సంగాయపల్లి తండా గిరిజనులతో సమావేశం



సంగాయపల్లి గిరిజనులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

ధారూరు: సాగుభూమి కోసం అడవులను నరికితే భవిష్యత్ తరాలకు ముప్పు తప్పదని, అడవులను కాపాడుకోవడం మన బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని సంగాయపల్లి తండా గిరిజనులకు తన కార్యాలయంలో అడవిని నరకడం వల్ల కలిగే ముప్పును వివరించారు. సాగు భూమి కోసం చెట్లను నరికితే మీరే ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు. ఒక్క చెట్టును నరికినా తమ దృష్టికి వస్తుందన్నారు. అటవీ భూములకు హద్దులు నిర్ధరించి కందకాలు తవ్విస్తున్నామని తెలిపారు. ఇందుకు తండావాసులు సహకరించాలని కోరారు. కొంతమంది రాత్రివేళ అడవిలోకి ప్రవేశించి చెట్లను నరికివేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేయడం నేరమని పేర్కొన్నారు. అటవీ భూమిని సాగుభూమిగా మారిస్తే గూగుల్ మ్యాప్‌లో బయటపడుతుందన్నారు. ఇకపై చెట్లను నరకమని గిరిజనులు డీఎఫ్ఓకు హామీ ఇచ్చారు. సమావేశంలో ధారూరు రేంజర్ బీ రాజేందర్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం అభినందనీయం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



నిత్యాన్నదాన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు: దశాబ్దాల తర్వాత తాండూరు భావిగి భద్రేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణమాత దాసోహ భవనాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్, వీరశైవ సమాజం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి కృషితో ఆలయం అభివృద్ధి చెందుతోందన్నారు. గతంలో ఇక్కడ అన్నదానం జరిగేదని.. భవనం శిథిలం కావడంతో నిలిచి పోయిందన్నారు. ఆలయ కమిటీ, వీరశైవ సమాజం ప్రతినిధులు నూతన భవనాన్ని నిర్మించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వామివారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, వీరశైవ సమాజం అధ్యక్షుడు ఆర్.బస్వరాజ్, సభ్యులు పటేల్ శ్రీశైలం, కోర్వార్ నగేష్, లింగదల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చిలుక వాగు ప్రక్షాళన

పట్టణంలో వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు చిలుక వాగు ప్రక్షాళన పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా తాండూరులోని కొడంగల్ మార్గంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

తాండూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి

తాండూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. తాండూరు మున్సిఫ్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. పట్టణంలో సబ్ కోర్టు ఏర్పాటయ్యేలా చూడాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సబ్‌కోర్టు ఏర్పాటయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పార్టీని బలోపేతం చేద్దాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

కుల్కచర్ల: క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో బూత్ కమిటీ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రం వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే అభివృద్ధి చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎక్కువ మంది గెలిచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, నెరవేర్చని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘనపురం వెంకటయ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, దిశ కమిటీ సభ్యులు జానకిరాం చౌహాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాటనిపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: కొడంగల్ సబ్‌స్టేషన్ 33కేవీ లైన్ మరమ్మతుతోపాటు మెయింటెన్స్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం మత్తులో కూలీ ఆత్మహత్య


వీరేశం మృతదేహం

తాండూరు రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని సిరిగిరిపేట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంటింటి ఈశ్వరప్పకు ముగ్గురు కొడుకులు. అందరికి వివాహం కావడంతో వేరు వేరు కాపురాలు పెట్టారు. పెద్ద కుమారుడు వీరేశం(37) కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఆయన మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంటి పరిసరాల్లో వీరేశం ఉరేసుకున్నాడు. ఉదయం ఇంటి ఆవరణలో విగతజీవిగా పడి ఉండటాన్ని ఆయన భార్య పుష్పమ్మ చూసి కుటుంబసభ్యులకు తెలిపింది. మద్యానికి బానిసై తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఈశ్వరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి


శివను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: యువత ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో అగ్నివీర్‌కు ఎంపికైన శివకుమార్‌ను ఘనంగా స్థానిక పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాల బారిన పడకుండా దృఢ సంకల్పంతో లక్ష్యం వైపు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు కృష్ణయ్య, అంబదాస్, గోపాల్, శ్రీనివాస్, హన్మంతు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు

బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్ల్యానాయక్


పోలీస్ స్టేషన్ ఎదుట నాయకులు

పరిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్ల్యానాయక్ అన్నారు. బహుజన ముక్తి పార్టీ బుధవారం జైల్ భరో ఆందోళన కార్యక్రమానికి పిలుపు నివ్వడంతో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం బీఎంపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఓట్లను దొంగలించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డాక్టర్.బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కనీస చర్యలు తీసుకోలేరన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో సాయిబాబా

అనంతగిరి: షిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రజలందరిపై ఉంటుందని ఆలయ ట్రస్టు సభ్యులు రాజేందర్ అగర్వాల్, సంతోష్ అగర్వాల్ అన్నారు. ఈ మేరకు వికారాబాద్ మండలం ఐనాపూర్ సమీపంలోని సాయిబాబా మందిరం అష్టమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడ హారతి, అభిషేకం, శ్రీ గణేశ, గోమాత, భవానిమాత తదితర పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో సాయిబాబా బృందం చేత భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆయా గ్రామాల ప్రజలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కారుమబ్బులు.. రైతన్న గుబులు

- పంట చేతికందే సమయంలో వర్షాల ముప్పు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


ఈర్లపల్లి శివారులో కోయడానికి సిద్ధంగా ఉన్న వరి

దౌల్తాబాద్: గత మూడు రోజులుగా పలుచోట్ల అకాల వర్షాలు కురిశాయి. సాయంత్రం కాగానే ఆకాశం మేఘావృతమవుతోంది. చల్లని గాలులతో పలుచోట్ల వానలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి రైతులు పంటలు సాగు చేశారు. సరిగ్గా ప్రతిఫలం చేతికందే సమయంలో అకాల వర్షాలకు దిగులు చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లో యాసంగి సాగు చేసిన వరి పంట చేతికందనుంది. మరో వారంలో కోతలు షురూ కానున్నాయి. ఇప్పటికే హార్వెస్టర్లతో కోతలు కోయడానికి పంటలు ఆరబెడుతున్నారు. వాతావరణ మార్పులు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతుల గుండెల్లో గుబులు రేపుతుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఆందోళన చెందుతున్నా. పంటకోసే సమయంలో వరుణ దేవుడు కరుణించాలని వేడుకుంటున్నారు.

5వేల ఎకరాల్లో సాగు

మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో యాసంగిలో బోరుబావులు, చెరువుల కింద సుమారు 5వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఈర్లపల్లి, అంతారం, నందారం, చల్లాపూర్ తదితర గ్రామాల్లో మరో రెండు మూడు రోజుల్లో పంట కోత కోయడానికి రెడీగా ఉంది. ఇంతలో ఆకాశంలో కారుమబ్బులు అకాల వర్షాలకు వరికోయాలా వద్దా అనే సందేహంలో ఉన్నారు. భారీ వర్షాలు కురిస్తే పంట పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 10 రోజుల కింద వరకు చాలా మంది రైతులు బోర్లలో నీరు లేక ఓ వైపు ఇబ్బందులు పడితే.. ప్రస్తుతం వానలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. అలాగే పంట నేలకొరిగితే పొలాల్లో నీరు నిలిస్తే హార్వెస్టర్లతో కోయడానికి కష్టంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

కోయాలో వద్దో..



యాసంగిలో సాగు చేసిన వరి పంట కోతకు వచ్చింది. మూడు రోజులుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం పడుతుందోనని ఆందోళనలో ఉన్నాం. పంట కోయాలో వద్దో తెలియడంలేదు.

– జనార్దన్‌రెడ్డి, రైతు, నందారం

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గాలని, అయినా కేంద్రం ఒకేసారి సిలిండర్‌పై రూ.50 పెంచడం ఏంటని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో గ్యాస్ వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. దీంతో నిత్యావసరాల ధరలపై కూడా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, నవీన్, శ్రీనివాస్, యాదయ్య, జంగయ్య, రాములు, వెంకట్, వెంకటయ్య, గోపాల్, అలివేలు, అంజియ్య తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై భారం

దుద్యాల్: కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక రూపంలో ప్రజలపై భారం వేస్తూనే ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య ఆరోపించారు. వంట గ్యాస్ సిలిండర్‌పై 50 రూపాయలు పెంచడంపై బుధవారం దుద్యాల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్నారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, రాములమ్మ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సిద్ధం కావాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సదానందరెడ్డి

అనంతగిరి: కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందరెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం అటల్‌జీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం వికారాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై మనం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ బస్వలింగం, మాజీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద చెంచుల ఉన్నతికి, ఉత్తమ వైద్య సేవల కోసం జిల్లాకు సంబంధించి మొబైల్ మెడికల్ యూనిట్ నందు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, పారమెడికల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన వారు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 2గంటలలోపు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 99085 98481లో సంప్రదించాలన్నారు.

కిరాణా షాపులపై దాడులు

గుట్కా, మద్యం బాటిళ్లు స్వాధీనం

కొందుర్గు: విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణ దుకాణాలపై దాడులు చేసి నిషేధిత గుట్కా, అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పట్టుకున్నారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొందుర్గులో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించామని, ఇందులో భాగంగా 20 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు సీజ్ చేశామన్నారు. అదే విధంగా అనుమతి లేకుండా కిరాణ షాపుల్లో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు, నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రవీందర్ నాయక్ తోపాటు దాదాపు 50 మంది పోలీసులు దాడుల్లో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కేశంపేట: ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు నింబధనలు పాటించాలని సీఐ నరహరి అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మండల పరిధిలోని అల్వాల, కొత్తపేట, కేశంపేట గ్రామాల్లో వాహనాల తనిఖీలు, కిరాణ షాపుల్లో చెక్కింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరహరి మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పలపల్లిలో షార్ట్ సర్క్యూట్

విలువైన విద్యుత్ పరికరాలు దగ్ధం

కందుకూరు: షార్ట్ సర్క్యూట్‌తో పలు గృహాల్లో మంటలు చెలరేగి విద్యుత్ పరికరాలు, విలువైన వస్తువులు దగ్ధమైయ్యాయి. ఈ సంఘటన కందుకూరు మండలం చిప్పలపల్లిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. చిప్పలపల్లిలోని ఎస్ఆర్‌నగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అయ్యే 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఇళ్లల్లోకి వచ్చే ఎల్‌టీ విద్యుత్ లైన్‌పై పడ్డాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పలు ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, వైరింగ్ దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇళ్లలో ఉన్న వారంతా భయాందోళనలకు గురై బయటికి పరుగెత్తారు. పెద్ద ఎత్తునే ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా బుధవారం ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. నష్టపరిహారం విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని కాలనీలో ఉదయం నుంచి మహిళలు సందడి చేశారు. రాత్రి వేళ అమ్మవారికి సమర్పించే బోనాల ఊరేగింపు ఆకట్టుకుంది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతదేహం

అనంతగిరి: గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఈనెల 7న సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు 60–65 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, బ్రౌన్ కలర్ షర్ట్, తెల్లగడ్డం ఉందన్నారు. ఎవరైనా గుర్తుపడితే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు బుధవారం సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొంరాస్‌పేట: మండల పరిధిలోని దుప్‌చర్లలో ఇసుకను నిల్వచేసి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టరును మంగళవారం రాత్రి పోలీసులు పట్టేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు. తహసీల్దారు అనుమతులు ఉన్న చోట కాకుండా అక్రమంగా మరో చోటునుంచి ఇసుకను నిల్వచేసి తరలిస్తున్న దుప్‌చర్లకు చెందిన శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, ట్రాక్టరును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆయన వివరించారు.

సన్నబియ్యం పేదలకు వరం

దౌల్తాబాద్: పేదలకు సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని గోకఫసల్వాద్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, కొండాగోపాల్, భీంరెడ్డి, రెడ్డిశ్రీనివాస్, షకీల్, జాకీర్ తదితరులున్నారు.

రేపటి నుంచి బాకారం ఉత్సవాలు

యాలాల: మండలంలోని బాకారం ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు భజన మండలి ఆధ్వర్యంలో యాలాల నుంచి స్వామివారి పల్లకీ సేవా కార్యక్రమం ఆలయం వరకు ఉంటుందన్నారు. శనివారం రోజు స్వామి వారికి అభిషేకం, అన్నదానం, రథోత్సవం ఉంటుందని తెలిపారు. ఆదివారం సత్యనారాయణస్వామి పూజ, పెరుగుబసంతం తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. జాతరకు భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆంజనేయస్వామి వంశపారంపర్య అర్చకులు, ధర్మకర్తలు హర్షవర్ధన్‌జోషి, విష్ణువర్ధన్‌జోషి తెలిపారు.

12న కరన్‌కోట్‌లో రథోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12, 13వ తేదీల్లో జాతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్ ఆలయం వద్ద 12న రాత్రి 10 గంటలకు రథోత్సవం, 13న లంకాదహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంసీహెచ్‌లో గర్భస్థ శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన


మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆందోళన చేస్తున్న బాధితులు

తాండూరు టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భస్థ శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ తాండూరు పట్టణ శివారులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట బుధవారం పలువురు ఆందోళనకు దిగారు. మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన లాలప్ప భార్య ఆశమ్మ పురిటినొప్పులతో మంగళవారం రాత్రి ఎంసీహెచ్‌లో చేరింది. పరీక్షించిన వైద్యులు మరో నెల రోజుల తర్వాత డెలివరీ కానున్నట్లు చెప్పి పంపేశారు. అయితే బుధవారం ఉదయం 6గంటలకు మరోసారి ఆశమ్మ పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు స్కానింగ్ తీసుకుని రావాలంటూ ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌కు పంపారు. స్కానింగ్ రిపోర్టును పరిశీలించిన వైద్యులు గర్భంలోనే శిశువు మృతి చెందిందని చెప్పారు. అనంతరం ఆపరేషన్ చేసి ఆడ మృత శిశువును బయటకు తీశారు. అయితే పురిటి నొప్పులతో ఆసుపత్రికి వస్తే, వైద్యం చేయకుండా డాక్టర్లు పూర్తిగా నిర్లక్ష్యం వహించారంటూ బాలింత ఆశమ్మ భర్త లాలప్ప, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఎంసీహెచ్ ఆసుపత్రిలో స్కానింగ్ తీయకుండా, ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌కు పంపారని, దీంతో సమయం మించిపోయిందన్నారు. పేదల ప్రాణాలంటే వైద్యులకు లెక్క లేదని, ఇక్కడ తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే వైద్యంలో తమ నిర్లక్ష్యమేమీ లేదని, స్కానింగ్ ఉదయం 10గంటల తర్వాతే తీస్తారని, అందుకే బయటకు పంపానని గైనకాలజిస్ట్ డాక్టర్ శాలిని తెలిపారు. డెలివరీకి నెలరోజులు పైన ఉన్నప్పటికీ గర్భంలో శిశువు గుండె సరిగా కొట్టుకోకవడం వల్ల శిశువు మృతి చెంది ఉన్నట్లు ఆమె చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు


ఇంట్లో కాలిపోయిన వస్తువులు

బొంరాస్‌పేట: వేసవితాపానికి ఉపశమనం కోసం ఇంట్లో పెట్టుకున్న కూలర్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండల పరిధిలోని తుంకిమెట్లలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సఫియాబేగం ఇంట్లో మధ్యాహ్నం కూలర్ ఆన్‌చేసుకొని ఉండగా కొద్దిసేపటికి అందులోంచి మంటలు వ్యాప్తించాయి. చూస్తుండగానే వేగంగా వ్యాప్తి చెందడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు అరవడంతో కాలనీ వాసులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక వాహనంతో సిబ్బంది మంటలు పూర్తిగా చల్లార్చారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారం, వస్తువులు కాలిపోయాయని బాధితురాలు వాపోయింది. రూ.6లక్షల మేర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. బాధితురాలిని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనిఫ్ పరామర్శించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ప్రధానం


వీడ్కోలు సమావేశంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని ఎంఈఓ వెంకట్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు షఫి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, స్కూల్ చైర్మన్ నసీమా బేగం, కాంప్లెక్స్ సీఆర్‌పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు ప్రవీణ్, ముత్యప్ప, నరేందర్, సావిత్రి, స్వప్న, జరీనా బేగం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలి

- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడుతాం
- మిషన్ భగీరథ కార్మికులు


మిషన్ భగీరథ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కొడంగల్ రూరల్: ఇతర జిల్లాల్లో ఇచ్చే వేతనాల మాదిరిగానే తమకు ఇవ్వాలని స్థానిక మిషన్ భగీరథ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మిషన్ భగీరథ సంప్‌హౌజ్ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా మిషన్ భగీరథలో పనిచేస్తున్న తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో కార్మికులకు రూ.15,500లు చెల్లిస్తుండగా కొడంగల్‌లో కేవలం రూ.10,900లు మాత్రమే అందిస్తున్నారని వాపోయారు. గతంలో 9,900లు అందించేవారని, ఈ నెల నుంచే వెయ్యి రూపాయలను పెంచారన్నారు. గత ఆరు నెలల నుంచి ఈపీఎఫ్ జమ చేయడంలేదని, తమ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొడంగల్ మిషన్ భగీరథ అధికారులకు వినతిపత్రం అందించారు. గురువారం సమస్యలను పరిష్కరించని పక్షంలో శుక్రవారం నుంచి విధులు బహిష్కరిస్తూ సమ్మె చేయనున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాంచందర్, వెంకటయ్య, అబ్దులప్ప, ఆదిత్య, హరిప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

‘ఫ్యూచర్’తో ఉద్యోగావకాశాలు


భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, అమెజాన్ సంస్థ ప్రతినిధులు

- అమెజాన్ సంస్థ సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కాంగ్రెస్ సర్కార్ ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తుండడంతో ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అమెజాన్ సంస్థ గునుగల్ ఆదర్శ కళాశాల, పాఠశాలను దత్తత తీసుకుని రూ.కోటిన్నరకు పైగా నిధులతో కిచెన్, భోజనశాల అలాగే గదులకు పెయింటింగ్ తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. బుధవారం వాటిని ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసి ఫోర్త్‌సిటీ(ఫ్యూచర్)ని నిర్మిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ కంపెనీలు ఇక్కడ రూ.లక్ష 40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే ఫ్యూచర్‌సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మిస్తుందని తెలిపారు. అమెజాన్ సంస్థ ఈ ప్రాంతంలో పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ ప్రతినిధులు ఓంకార్, ట్రైలర్, పార్థసారథి, ఆదర్శ కళాశాల, పాఠశాలల అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, గునుగల్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్ గ్రామంలో అమెజాన్ సహకారంతో నూతన గ్రంథాలయం నిర్మాణం కోసం ఎమ్మెల్యే రంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూధన్‌రెడ్డిలు కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న పోటీ ప్రపంచంలో చదువులు విలువై పోయాయన్నారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికి ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, మాజీ సర్పంచ్ సమతరాంరెడ్డి, నాయకులు శశాంక్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాండు, మహేందర్, విజయ్, శివ, ప్రభు, సంజీవ, శ్రీను, చింటురెడ్డి, మల్లేష్, బీరప్ప, దాసు, శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.